# గోపాలం రంగుల కలలు



అందే గోపాలకృష్ణమూర్తి

గోపాలం ప్రేమించాడు. జనరల్‌గా ప్రేమించినవాళ్లు మితంగా భోజనం చేస్తారు. ఇంకా మితంగా నిద్రపోతారు. మిగతా సమయాల్లో ఎక్కువగా ఆలోచిస్తుంటారు. రాత్రుళ్లు చందమామను చూసి విసుక్కుంటారు. నిద్రపట్టక సతమతమవుతుంటారు. పొరబాటున కునుకు పడితే చాలు—కలలు కనేస్తారు!

అందరికీలాగానే ప్రేమ గోపాలాన్ని కూడా ఎఫెక్ట్ ఇచ్చింది. అంచేత మితంగా పెరుగన్నం మాత్రమే భోంచేసి, అసలు నిద్ర రాక, చందమామను చూసి కసురుకుంటూ, విపరీతంగా ఆలోచిస్తూ, సతమతమైపోతూ, పొరబాటున మాగన్నుగా కునుకు తీశాడు. అంతే—వరసగా రెండు కలలు—టెక్నికలర్ కలలు—కనేశాడు.

ఒకరోజు గోపాలం అలా పూలబాటమీద నడుచుకొంటూ, 'జియా, బేకరార్ హై' ఈలపాట వేసుకొంటూంటే, అక్కడే సందు మొదట్లో—తీరుబడిగా కూర్చున్న బ్రహ్మదేవుడు 'రావోయ్ గోపాలం—రా, రా' అని ఆప్యాయంగా పిలిచాడు. మరి బ్రహ్మదేవుడుగదా, బావుండదని—'వ్వాట్ సార్, తీరిగ్గా ఏదో సృష్టించే ఏర్పాటులో ఉన్నట్లున్నారు?' అన్నాడు గోపాలం. 'ఏం చేయమంటావ్ గోపాలం! భూలోకంలో చూస్తే నా ఆటలు సాగనీయకుండా ఈ సోకాల్డ్ మినిస్టర్లంతా కట్టుగట్టి ఎర్ర ముక్కోణాలతో కార్నేసుకు తిరిగేస్తూ, బర్త్ కంట్రోల్ చేసిపారేస్తున్నారు. ఇక నేనేం సృష్టించగలను అక్కడ? నేను సృష్టించిన ఈ మనుషులు నాకే 'ఎర్త్' పెట్టేస్తుంటే, ఈ భూలోకంమీద అసహ్యం పుట్టుకొస్తుంది. అందుచేత అదిగో ఆ చంద్రలోకంలో సృష్టి ప్రారంభిద్దామని, నా శాయశక్తులా ప్రయత్నించి, ఈ వేళ తెల్లారుఝామున ఓ అమ్మాయికి రూపకల్పన చేశాను. భూమ్మీద నేను ప్రవేశపెట్టిన 'ఈవ్' కంటే కొన్ని కోట్లరెట్లు సౌందర్యవతిగా ఈ అమ్మాయిని సృష్టించగలిగాను. రేపోమాపో ఈ మానవులు ఆ చంద్రలోకంలో నివసించే ఏర్పాట్లు చేసుకొంటున్నారుగదా, వాళ్లక్కడికి వెళ్లేసరికి ఈ 'బాలిక'ను చూసి అసూయ చెందాలి. నా సృష్టి ఎంత గొప్పదో చూసి వాళ్ల కళ్లు అంటుకుపోవాలి! అంచేతనే భూలోకంలో సృష్టించినంత విరివిగా ప్రాణులను అక్కడ సృష్టించను. ఎంచి ఎంచి, తూచి తూచి, మితమైన జనాభాను మాత్రమే అక్కడ ప్రవేశపెడ్తాను. ఇంతకీ, నా కొత్త సృష్టి చూసేవా?' అన్నాడు బ్రహ్మదేవుడు.

'లేదు సార్, నాకేం కన్పించడం లేదు.

ఏదీ ఆమె?' ఆశగా గోపాలం నోరుతెరచి నిల్చుండిపోయాడు.

బ్రహ్మదేవుడు నవ్వేడు. ఆ నవ్వులోంచి ఏదో వెలుగు ప్రసరించింది. వెలుగులో ఏదో రూపం అలా అలాగ్గా పెరిగి ఆగిపోయింది. బ్రహ్మ చేయెత్తి ఆశీర్వదించాడు. చేతిలోనుండి వెలువడ్డ వెలుగు కిరణాల చివర కనులు మిరుమిట్లు గొలిపే సౌందర్యరాశి! అయితే ఒకటి—ఆమెలో చలనం లేదు!

కాస్సేపు విస్తుబోతూ నిల్చుండిపోయిన గోపాలంవైపు గర్వంగా చూసేడు బ్రహ్మ.

'ఆఁ, ఈమెలో చలనం లేదని కంగారు పడమాకోయ్ గోపాలం! పేరుపెట్టిపిలిస్తే గాని ఈమె కదలదు, మెదలదు. ఆ పేరు అతి మధురంగా ఉండాలి. అతిసున్నితంగా ఉండాలి! అందానికి మారుపేరుగా ఉండాలి! ఆలోచించి చెప్పు. ఈమె కా పేరు నచ్చితే వెంటనే చలనం వస్తుంది. అప్పుడు నువ్వేం కోరుకుంటే అది ఆమే ఇస్తుంది! చూస్కో మరి, ఛాన్సు!' — అన్నాడు నవ్వుతూ.

గోపాలం ఉద్ధృతంగా ఆలోచించాడు. తను చదివిన కథల్లో జగదేకసుందరీమణుల పేర్లను వల్లెవేసికొన్నాడు. బాగా ఆలోచించి 'ఆఁ!' అని ఎగిరి గంతేసాడు. 'చెప్పవోయ్, చెప్పు!' అన్నాడు బ్రహ్మ, మందస్మిత వదనారవిందంతో.

'మోనలీజా!' అన్నాడు గోపాలం. 'ఛ!' అన్నాడు బ్రహ్మ. 'నువ్వు కూడా శంకర్ జైకిషన్లలాగ కాపీ కొడ్తావనుకోలేదోయ్ గోపాలం! ఆ పేరు 'డావిన్సీ' తను చిత్రించుకొన్న కళాఖండానికి పెట్టుకొన్న పేరు. దానిని నా సృష్టికి—నా ప్రత్యేకమైన, ప్రాణప్రదమైనసృష్టికి పెట్టమంటావా? సెల్లి! అదీకాక, ఆ పేరు భూలోకంలో చాలామందికి ఉన్నది. మీ సినిమా హీరో దేవానంద్ అనే అతనున్నాడు చూసేవా—'

'ఆఁ, చూసేన్సార్, నా ఫేవరెట్ హీరో! అతని పిక్చర్లు నేను ఒక్కోటి నాలుగైదుసార్లు చూస్తాను. 'గైడ్' నాలుగుసార్లూ, 'జూయల్ థీఫ్' ఆరుసార్లూ—'

'ఇదిగో నీ సోద నీదేగాని, నా మాట వినవంటావ్, నేచెప్పేది పూర్తిగా విని ఆనక నీ సోద మొదలెట్టు!' కోప్పడ్డాడు బ్రహ్మ.

'సారీసార్, కానీయండిసార్ మీ హరికథ!' వినయంగా అన్నాడు గోపాలం, చేతులు కట్టుకొని వంగుని.

'వోయ్, మరి విన్లేయ్యకు! మీ దేవానంద్ వాళ్లావిడ్ని 'మోనా' అని పిలుస్తాడు. ఆపేరుతెచ్చి ఇక్కడ పెట్టడాన్కి నాకిష్టం లేదు. అలాగే 'లీజా' అనే పేరు కూడా చాలా మంది ఆంగ్లో ఇండియన్ ఆడపిల్లలకుంది. అటువంటి పేర్లు నాకక్కర్లేదు. ఇంతవరకూ ఎక్కడా ఆపేరు ఉండి ఉండకూడదు. పైగా, నా ఈ అపూర్వసృష్టికి అన్నివిధాలా సరిపోయినదై ఉండాలి! రెండో ఛాన్సు తీస్కో—' అన్నాడు బ్రహ్మ.

గోపాలం ఆలోచనలో పడ్డాడు. కాస్సేప్పోయాక ఆనందంగా 'సార్ సార్!' అన్నాడు. 'ఛ, అదేం పేరోయ్?' 'సార్ సారా'—సర్వర్లాగాను! నువ్వింత ఛండాలమైనపేరు...'

'అబ్బెబ్బే—అది పేరు కాదు సార్! మిమ్మల్ని పిలిచాను అంతేగానీ...'

'అయితే ఏమిటో చెప్పు!'

'మరి...నాకు తోచినప్రకారం చెబుతాను! తవరేమీ కోంపడకూడదు—ఒకవేళ బాగోప్పోతే!' జంకేడు గోపాలం.

'ఫర్వాలేదు కానీయ్!' అభయమిచ్చేడు బ్రహ్మ.

'చూడండి, తవరీ సృష్టిని తెల్లారుఝామునే చేసేనన్నారుగదా, అందుచేత సింబాలిక్గా—అంటే—ఉషఃకాలంలో సృష్టించబడింది గనుక—పాపపేరు 'ఉషశ్రీ' అనో సింపుల్గా 'ఉష'అనో... అబ్బే కంగార్లేదు, తమరి అభిప్రాయం సెలవీయండి!' అన్నాడు గోపాలం ఒబ్బిడిగా నిల్చొని.

బ్రహ్మదేవుడు ఆలోచనలో పడ్డాడు! కాస్సేపు సతమతమై 'నాకు సమ్మతమైనా ఆమెకు నచ్చలేదు గావును. అందుచేతనే చలనం రాలేదు. అయినా గోపాలం! ఆపేరు భూలోకంలో ఎంతోమందికి ఉన్నది. ఎన్నోకథలలో అచ్చయింది. అందుచేత వేరేపేరు సజెస్ట్ చెయ్ నీ పనివాడితనం నిరూపించుకో. తీస్కో మరొక్కఛాన్సు! ఆఖరిఛాన్సు! గుర్తుంచుకో గోపాలం! ఇంతవరకూ ఆపేరు మానవ మాత్రులకెవరికీ ఉండి ఉండకూడదు. ఆపేరు వినబడగానే నా ఈ 'అపురూపమైన సృష్టి'కి చలనం రావాలి! అప్పుడే అది సరైన పేరని భావించగలను—బ్రహ్మ వహ్వానం వహించాడు.

ఊహించడం ప్రారంభించాడు గోపాలం 'ఈ సుందరికి పేరు ఊహించడం ఇంత కష్టమా? ఊహాకందనిపేరు వేరే ఏదైనా ఉంటుందా? బ్రహ్మదేవుడి ఊహకే అందని పేరు ఈ సుందరికి పెట్టడం తనవల్ల సాధ్యమా? ఈమె కేవలం ఊహాసుందరేనేమో! ఔను, ఔను...' ఊహించుకొంటున్న గోపాలం ఒక్కపెట్టున 'ఊహాసుందరీ!' అని అరిచాడు!

ఎక్కడో వెయ్యిసితార్లూ, వెయ్యివీణలూ, మోగినశబ్దమైంది!

ఎక్కడ్నించో కోటిమల్లెలూ, కోటి సన్నజాజులూ రాలి పడినయ్!

ఎన్నోచామంతులూ, మరెన్నో సంపెంగలూ చిరునవ్వులు చిందించినయ్!

ఎక్కడ్నించో—చిఱుగజ్జెల సవ్వడి! మంచుపొగ, తుమ్మెదల ఝంకారం! గోపాలాన్కి గుండె జల్లుమన్నది. సంభ్రమాశ్చర్యాలతో అప్రతిభుడై అలాగే నిల్చుండిపోయాడు.

ఊహాసుందరి సున్నితంగా నడుస్తూ బ్రహ్మదగ్గర్సా వెళ్లి, 'గుడ్మార్నింగ్ డాడీ!' అన్నది వయ్యారంగా.

'సృష్టింపబడి క్షణమైనా కాలేదు; నువ్వుకూడా అప్పుడే ఆంగ్ల ధోరణిలోనే హొయలుపోతున్నావా తల్లీ!'అన్నాడు 'ఊహ' తలను నిమురుతూ.

'యస్ డేడీ, నన్ను చంద్రమండలానికి పంపుతానన్నారు గదా, అక్కడికొచ్చే అమెరికన్సు మరి నాతో అదే భాషలో మాట్లాడ్తారుగదా అని, ఇప్పట్నించే అలవాటు చేసుకొంటున్నాను' అన్నది ఊహ వినయంగా.

'నాకంటె ఎక్కువ దూరదృష్టి ఉందమ్మా నీకు! ఎంతైనా నువ్వు నా సృష్టివి కదా! సరే, చూడు, అతను ఎవరో తెల్సుగదా?' అన్నాడు బ్రహ్మ గోపాలాన్ని చూపెడుతూ.

'సోండి డేడీ, మరీ విన్లేస్తున్నారు. నన్ను సృష్టించింది వీరైతే నామకరణం వారేగదా!' అంటూ చీరకొంగు బొటన

ప్రేలికి అదేపనిగా చుట్టేసుకో సాగింది 'ఊహ'.

'నీకు నచ్చినపేరుతో పిలిస్తే అతనికి నచ్చినదేమైనాసరే ఇచ్చేస్తానని అభయ హస్తమిచ్చేనమ్మా. దానిని నీద్వారానే అతనికి ఇప్పిస్తాను. కోరుకొమ్మను ఏం కావాలో!' అన్నాడు బ్రహ్మ.

'ఊహ' గోపాలంవైపు క్రీగంట చూసి, జడ ప్రక్కన జేరిపోయింది. "ఏదేవి టమ్మా — అడుగు ఏం కావాలో కోరు కొమ్మను!" బుజ్జగిస్తూ అన్నాడు బ్రహ్మ.

'ఊహ' ఓసారి మళ్ళీ గోపాలంవైపు చూసి, 'ఛీ' మని కళ్ళుదించేసుకొని, మెళ్ళోని వజ్రాల పతకాన్ని చప్పరించేస్తూ, "ఊఊఁ, నేనడగను బాబా!" అన్నది.

"చూడు గోపాలం, అమ్మాయి సిగ్గు పడుతుంది. నువ్వే చెప్పోయ్ ఏంకావాలో!" అన్నాడు నవ్వుతూ, బ్రహ్మ.

అంతే! గోపాలం ముడేసుకు పోయాడు. కుడిచేతిని ఎడమచేతితో పెనవేసేసి, ముకు ళించుకుపోయి, కుడిచేతి బొటనవ్రేలిని నోట్లో పెట్టేసుకొని, దాని గోరుని తినేయసాగాడు. గోపాలంజుట్టు కళ్ళమీద పడిపోయింది. కళ్ళు జాలిగా, ప్రేమగా, గోముగా ఊహాసుందరికేసి చూసినయ్.

"అదేవిటోయ్, అలా శివతాండవం చేసేస్తున్నావేమిటి? అరె, అలా అయి పోతున్నావేమిటీ?" — ఏమీ అర్థంకాక అడిగాడు బ్రహ్మ.

# గోపాలం రంగులకలలు

"హిహిహీ!" అన్నాడు గోపాలం అదే భంగిమలో..

"హిహిహీ!...హీ!! సీ...సిగ్గేస్తుంది సార్!" అని కాళ్ళలో బ్రేకులేసుకుంటు న్నట్టుగా క్రింద పడిపోయాడు.

"అదేమిటోయ్ మరీ అంత సిగ్గు! లే లే. కోరుకో!" అన్నాడు బ్రహ్మ.

కాస్సేపోయాక తేరుకుని "అడిగేయ మంటారా మరీ? అన్నాడు"

"తప్పకుండా. ఐ విల్ గివ్ ఎనీథింగ్ యూ వాంట్!" అన్నది ఊహ.

"హిహీ! ఐ...ఐ వాంట్..."

"ఆగిపోయారేం? ... అడగండి ..." ముందుకు వచ్చేస్తూ అన్నది ఊహ:

"ఐ వాంట్— ఊహాసుందరీ!" —

కళ్ళంటుకున్నాయ్ బ్రహ్మకి! సిగ్గుతో కుంచించుకుపోయి బ్రహ్మదగ్గర్గా వెళ్ళి పోయింది ఊహ. మౌనం వహించాడు బ్రహ్మ.

"ఏం మాస్టారూ! ఆడినమాట తప్పే ఆలోచనలో ఉన్నట్టున్నారు. అసలే మా భూమ్మీద మీకు పూజలెవరూ చేయరు. మీరు పాప్యులర్ దేవుడుకాదు. అందులోనూ మీరు విలాసంగా మానవులను సృష్టించ డాన్కి వీల్లేకుండా ఎర్ర ముక్కోణాల జీవులు విరవిహారం చేస్తున్నాయ్. ఇప్పుడు ఆడినమాట తప్పేరని తెలిస్తే కనీసం మీ పేరు తలచే నాథుడుకూడా ఎవరూ ఉండరు అయిదు నిముషాలు టైమిస్తున్నాను. 'ఊహ'ను నాతో పంపేయండి'

"బ్లాక్‌మెయిల్ చేస్తున్నావా గోపాల! నీకిది అన్యాయం అన్పించడంలేదూ? నా అపూర్వ సృష్టిని నీతో భూలోకాన్కి తీసుకుపోతావా? మరేదైనా కోరుకో నాయనా!"

"ఇంకా నాలుగు నిమిషాల వ్యవధి మాత్రమే ఉన్నది!" గోపాలం హెచ్చరిక.

"నిన్ను చూస్తుంటే భస్మాసురుడి కథ జ్ఞాపకమొస్తున్నది గోపాలం. నా మాట విను—"

"వినను నాకు టైములేదు."

"కావల్సిస్తే వాచీ ఇస్తాను!"

"ఛీ బోడి విట్చ్లో మీరూను! వేగం ఊహను నాతో పంపండి —"

"తల్లీ, వెళ్తావామ్మా?" జాలిగా ఊహవైపు చూశాడు బ్రహ్మ.

"ష్యూర్ డేడీ! ఐ లైక్ హిమ్, ఐ...లవ్ హిమ్!" అంటూ చెంగున గెంతి గోపాలం చెయ్యిపట్టుకున్నది.—ఊహాసుందరి

స్తంభించి పోయాడు బ్రహ్మ! "వయ సులో ఉన్న కుమార్తెలు ఎంతటి కృత ఘ్నులు! కనిపెంచిన తల్లి తండ్రులను క్షణంలో కాలదన్ని, కన్నుపడిన వాడితో, కలసిపోయి, కిలకిలమంటూ—"

"వస్తాం డేడీ!"— ఊహ.

"వెళ్ళొస్తాం మామయ్యగారూ!"— గోపాలం.

ఆలోచనల నాపుకొంటూ జెట్టాపట్టా లేసుకొని ఛెంగున గెంతుకుంటూ వెళ్ళి పోతున్న ఊహాని, గోపాల్నీ చూస్తూ అలానే కూర్చుండిపోయాడు బ్రహ్మ.

"చూడు ఊహా, నిన్ను 'ఊహా ఊహా' అని పిలిస్తే, మా భూలోకంలో చాలా ఆర్టిఫిషియల్‌గా ఉంటుంది. అంచేత 'సుందరీ సుందరీ' అని పిలుస్తాను, సరేనా!" అన్నాడు గోపాలం 'ఊహ' ముంగురులను సవరిస్తూ.


"నువ్వెలా పిల్చినా నాకిష్టమే గోపాల్!" అంటూ ఊహ గోపాలం బుగ్గమీద 'ము-' పెట్టుకొని పరుగెత్తుంది కవ్విస్తు న్నటు గా.

"సుందరీ — సుందరీ!" అంటూ అరుస్తూ అనుసరించాడు గోపాలం.

* * *

"సుందరీ — సుంగూ — సుం ద రీ!"

"రాస్కెల్, లే! పదింబావయింది,



సుందరి గుర్తుకొచ్చింది నీకు?'' అంటూ రూమ్మేట్ 'వాసూ' వీపుమీద చరిచాడు, గోపాలాన్ని.

'అబ్బ — ఉండరా,' బద్ధకంగా లేచాడు గోపాలం, వాసుని తిట్టుకుంటూ.

'ఈవేళ ఆదివారంగా, నువ్వు కలలు గంటున్న సుందరి 'బర్త్‌డేపార్టీ' సాయంత్రమే! లేచి ఇప్పట్నుంచి తయారవ్వు'

'అబ్బా!' అనుకొని ఒళ్ళు విరుచుకొన్నాడు గోపాలం

*    *    *

# గోపాలం రంగుల కలలు

'మీరు నన్ను పార్టీకి పిల్చేరంటే నిజంగా కలో నిజమో తేల్చుకోలేకపోయాను మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ద డే మిస్ సుందరీ!' అంటూ చిన్న బహుమతి నందించాడు గోపాలం.

'థేంక్యూ వెరీమచ్' అంటూ చుట్టు ప్రక్కల వాళ్లను లాంఛనంగా పరిచయం చేసింది.

''ఐయామ్ సారీ గోపాలమ్ — నా పార్టీకి చీఫ్‌గెస్ట్‌ని మీకు పరిచయం చేయడం మర్చిపోయాను రండి — చీఫ్ గెస్ట్‌ని మొన్ననే అమెరికానించి తెప్పించేను అక్కడ డాక్టరేట్ పుచ్చుకుని నాపార్టీకి హాజరయేందుకు కంగారు కంగారుగా వచ్చేసేడాయన చూడు ఆనంద్, ఈయన గోపాల్ అని నా స్నేహితుడు. మాంచి ఏక్టివ్ ఫిగర్. ఈయన డాక్టర్ ఆనంద్. పుడుతూనే నా మీద అన్ని హక్కులూ కొనేసుకున్నాడు. అంటే మా బావ అన్నమాట. నేనంటే పడి ఛస్తాడు. ఏం బావా, అవునా?'' అంటూ గడగడలాడించింది సుందరి.

'హౌ డుయుడూ?' అంటూ చేయి ముందుకు జాచాడు డాక్టర్ ఆనంద్. గోపాలానికి స్పృహ లేదు!

*    *    *


స్పృహ వచ్చేసరికి గోపాలం ప్రక్క మీదనుండి లేవలేకపోయాడు. రెండురోజుల క్రితం నిజంగా జరిగినదంతా మళ్ళీ కలలావచ్చి కలతపెట్టింది రెండు రోజుల నుండీ నిద్రాహారాలుమాని, జుట్టురేపేసుకొని, గోళ్ళు పెంచేసుకొని, తినేసిన మూలంగా విపరీతంగా నీరసించి పోయాడు గోపాలం.

'కలకూ నిజానికీ ఎంత తేడా? తన మొదటి బంగారుకలలో తను ప్రేమించు కొన్న సుందరి ఊహాసుందరిగా ప్రత్యక్షమై, తనను ఊహాలోకాలలో విహరింపజేసి, 'వాస్తవం'లో 'బావ'ను పరిచయం చేసి, అధఃలోకాలకి విసరివేసి తను మాత్రం హాయిగా వెళ్ళిపోయిందే!' అనుకుని కుమిలిపోయాడు గోపాలం.

'మొదటికల నిజమై, రెండోది నిజంగా 'కల'పోతే ఎంత బావుణ్ణు!' అనుకొని అంత విచారంలోనూ ఆప్టిమిస్టిక్‌గా ఆలోచించేడు.

'ఛీ! జీవితంలో ఎప్పుడూ కలలు కనకూడదు కనినా ఆశలు పెంచుకోకూడదు. ఇంతెందుకు, ప్రేమించకపోతే ఏ గొడవా ఉండదు. అందుచేత అసలు ప్రేమించనే కూడదు!' — రెండు 'రంగుల కలల' నీతిని సులభంగానే గ్రహించి, తెంపలేసుకొన్నాడు గోపాలం.

'ఇదుగో గోపాలం, సుందరి 'వెడ్డింగ్ కార్డ్' పంపింది' అంటూ రూమ్మేట్ అందించిన శుభలేఖనుచూస్తూనే 'సుందరీ!' అంటూ తలగడలోకి తల దూరేసుకొన్నాడు గోపాలం!



సాంకేతిక సమాచారాన్ని సేకరించడానికి అపోలో-8 ప్రయోగానికి ముందు పశ్చిమ జర్మనీ ప్రయోగించిన రాకెట్ హీయోస్. భూమిచుట్టూ తిరిగే ఈ రాకెట్‌లోని సౌరఘటాన్ని చిత్రంలో చూడవచ్చు.
—(యు. పి. ఎస్-డాడ్.)